సాక్షి తిరుపతి

బుధవారం । 11 । జూన్ । 2025



'అయ్యో'ర్ల పడిగాపులు

ఎస్జీటీల కౌన్సెలింగ్ మంగళవారం రాత్రి 9.30 గంటలకు ప్రారంభమైంది. అయ్యోర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. - 8లో



రోడ్డుపై బైఠాయించిన రైతులు

మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలంటూ రైతులు రోడ్డుపై బైఠాయించిన ఘటన పాకాలలో చోటుచేసుకుంది. - 8లో



దోపిడీయే మా సంకల్పం!

తిరుపతి నడిబొడ్డులోని ఓ కార్పొరేట్ ఆస్పత్రి రోగుల నిలువు దోపిడీయే తమ సంకల్పమని చాటిచెబుతోంది. - 8లో

మహిళలకు రక్షణేది బాబు?

ఏడాది పాలనలో పెరుగుతున్న అత్యాచారాలు, దాడులు

- మహిళా రక్షణ చట్టాలు నిర్వీర్యం
- తిరుపతి అంబేడ్కర్ విగ్రహం వద్ద వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్ల ఆందోళన



మహిళలకు రక్షణ కల్పించాలని అంబేడ్కర్ విగ్రం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు

తిరుపతి మంగళం : 'మహిళలు మా అక్క చెల్లెమ్మలు.. తోబుట్టువులు.. మా ఇంటి ఆడపడుచులు.. మహిళలకు అన్యాయం జరిగితే ఎందాకైనా వెళ్తాం.. అంటూ ఎన్నికలకు ముందు చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ప్రగల్భాలు పలికారు. తీరా అధికారంలోకి రాగానే మహిళలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా వైఫల్యమయ్యారు. నిత్యం అత్యాచారాలు, దాడులు పెరుగుతున్నా నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారు' అంటూ వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు మాధవిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గీతాయాదవ్, తిరుపతి నగర బూత్ కమిటీ ఇన్‌చార్జ్ ముప్పాల సాయికుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. ఎన్నికల సమయంలో మహిళలకు ఎక్కడ అన్యాయం జరిగినా సహించమంటూ గొంతు చించుకుని అరిచారని, వారిని నమ్మి ఓట్లేసినందుకు తగిన శాస్తి జరిగిందని మండిపడ్డారు. కూటమి నాయకుల చేతుల్లో అత్యాచారాలకు, దాడులకు గురవుతున్న మహిళలకు, బాలికలకు ఏమి న్యాయం చేశారని ప్రశ్నించారు. మహిళల పట్ల కూటమి నాయకులు కీచకుల్లా మారారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో మహిళల పట్ల జరుగుతున్న అత్యాచారాలు, దాడులపైన ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. రాష్ట్రానికి ఓ మహిళ హోమ్ మంత్రిగా ఉండి కూడా మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించలేకపోతున్నారని మండిపడ్డారు.

గతంలో మహిళా రక్షణకు పెద్దపీట

గత వైఎస్సార్‌సీపీ పాలనలో తమ నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మహిళా రక్షణ కోసం దిశ, నిర్భయ వంటి అనేక చట్టాలను తీసుకొచ్చి మహిళలకు రక్షణ కల్పించారని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళా రక్షణ చట్టాలను నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. కూటమి నాయకులు మహిళల పట్ల ఇలాగే వ్యవహరిస్తే భవిష్యత్‌లో తగిన బుద్ధి చెప్పడం ఖాయమని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాళ్లు గోలి విజయలక్ష్మి, పునీత, పుష్ప, శారద, శాంతారెడ్డి, రాజేశ్వరి, యశోద, రాధ, మాదవి, కృష్ణవేణమ్మ, సాయికుమారి, షర్మిల, రెడ్డిరాణి, పార్వతమ్మ, దుర్గ, కవితమ్మ పాల్గొన్నారు.

అడ్డగోలు అడ్మిషన్లే.. పెట్టుబడి!

జిల్లాలో ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యాలు బరితెగిస్తున్నాయి. విద్యాసంవత్సరం పునఃప్రారంభానికి ముందే అందినకాడికి దోచేస్తున్నాయి. అమాయక జనానికి వల వేసి అడ్డగోలుగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. తల్లిదండ్రుల స్థాయిని బట్టి రేట్లు విధిస్తున్నాయి. అడ్మిషన్లే పెట్టుబడిగా అమాయక జనం నెత్తిన గుదిబండ వేస్తున్నాయి. ఇంత జరుగుతున్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు పట్టనట్టు వ్యవహరించడం.. కనీసం అటువైపు కన్నెత్తి చూడడానికి కూడా జంకుతుండడం విమర్శలకు తావిస్తోంది.



జిల్లా సమాచారం

ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలు	సంఖ్య
ప్రాథమిక పాఠశాలలు	264
ప్రాథమికోన్నత పాఠశాలలు	145
ఉన్నత పాఠశాలలు	300
మొత్తం పాఠశాలలు	709
ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులు	18,256
ప్రాథమిక పాఠశాలల విద్యార్థులు	61,042
ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులు	35,345
ఉన్నత పాఠశాలల విద్యార్థులు	24,406
మొత్తం విద్యార్థులు	1,39,049
2025-26 విద్యాసంవత్సరంలో ముందస్తు అడ్మిషన్లు	32,154

జిల్లాలో పేట్రేగుతున్న ప్రయివేటు, కార్పొరేట్ యాజమాన్యాలు

- అడ్డగోలుగా అడ్మిషన్ ఫీజుల వసూళ్లు
- పర్యవేక్షణలో విద్యాశాఖ విఫలం
- ఆపసోపాలు పడుతున్న తల్లిదండ్రులు

చిత్తూరు కలెక్టరేట్ : తిరుపతి జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ యాజమాన్యాల పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా అడ్మిషన్లు చేపడుతున్నారు. ముందస్తుగా అడ్మిషన్ పొందితే ఫీజులో రాయితీ ఇస్తామంటూ ఆఫర్లు కురిపిస్తున్నారు. తీరా అడ్మిషన్ చేసుకున్నాక ఫీజులు మరింత పెంచేసి తల్లిదండ్రులను నిలువునా ముంచేస్తున్నారు. అడ్వాన్స్ బుకింగ్ పేర్లతో సీట్ల దందాను కొనసాగిస్తున్నారు. ఏజెంట్లను నియమించుకుని అడ్మిషన్‌ల ప్రక్రియ కొనసాగిస్తున్నారు. విద్యను వ్యాపారంగా మార్చేసి అడ్డగోలుగా దోచుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా చంద్రగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు, సూళ్లూరుపేట, గూడూరు, వెంకటగిరి నియోజకవర్గాల్లో నిబంధనలకు తూట్లు పొడుస్తున్నారు.

ప్రత్యేక బ్యాచ్‌ల పేరుతో దోపిడీ

కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ఒక్కో బ్రాంచ్‌లో ఒక్కో ధర ఉంటోంది. ఐఐటీ, టెక్నో, స్పార్క్ ఇలా పలు రకాల పేర్లతో అదనపు ఫీజులు వసూలు చేస్తున్నారు. విద్యాసంస్థల్లో అడ్మిషనన్ల సమయంలో ఎంట్రన్స్ టెస్టులు నిర్వహించకూడదనే నిబంధన ఉంది. అయితే పలు పాఠశాలల్లో ముందస్తుగా ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహించి అడ్మిషన్‌ల ప్రక్రియ చేపడుతున్నారు. విద్యార్థుల నైపుణ్యాల్లో తారతమ్యాలు సృష్టించి వారు మానసికంగా కుంగిపోయేలా చేస్తున్నారు. ప్రత్యేకంగా నిర్వహిస్తున్న బ్యాచ్‌లలో భవిష్యత్‌లో ఇంజినీర్, డాక్టర్‌లు అయ్యేందుకు అవసరమైన ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామంటూ ఇష్టానుసారం ఫీజులు పెంచేసి వసూలు చేస్తున్నారు. 2025-26 విద్యాసంవత్సరం ఇంకా ప్రారంభం అవ్వకనే ప్రైవేట్, కార్పొరేట్ బడుల్లో అడ్మిషన్లు పూర్తయ్యాయంటే అతిశయోక్తి కాదేమో.

విద్యాశాఖ విఫలం

జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాల పాఠశాలలు నిర్వహిస్తున్న అడ్డగోలు అడ్మిషన్‌ల దోపిడీని జిల్లా విద్యాశాఖ అధికారులు అరికట్టాల్సి ఉంది. ఆయా పాఠశాలల్లో జరుగుతున్న దోపిడీ పర్వం విద్యాశాఖ అధికారులకు తెలిసినప్పటికీ నోరు మెదపడం లేదు. ఎంఈవోలు, డీవైఈవోలు తనిఖీలు సైతం చేయడం లేదు. ఆయా విద్యాసంస్థల నిర్వాహకులతో లాలూచీ పడ్డారని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ముందస్తు అడ్మిషన్లు, అడ్డగోలు ఫీజుల వసూళ్ల పై విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి.

గత ఐదేళ్లలో అడ్డుకట్ట

ప్రైవేట్, కార్పొరేట్ యాజమాన్యాల్లో జరుగుతున్న అడ్డగోలు వసూళ్లు, అక్రమాలను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అడ్డుకట్ట వేసింది. ప్రత్యేకంగా ఫీజు నియంత్రణ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ కమిషన్‌లో నిష్టాతులైన విద్యావేత్తలను నియమించి క్షేత్రస్థాయి పర్యవేక్షణ ముమ్మరం చేసింది. కమిషన్ సభ్యులు తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదులు అందగానే నేరుగా సంబంధిత కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో తనిఖీలు చేపట్టేవారు. ఏవైనా అక్రమాలు జరుగుతున్నట్లు నిర్ధారణ అయితే ఆయా పాఠశాలల అనుమతులను రద్దు చేసేందుకు చర్యలు చేపట్టేవారు. దీంతో గత వైఎస్సార్‌సీపీ సర్కారు ఐదేళ్ల పాలనలో కార్పొరేట్ పాఠశాలల అక్రమాలకు అడ్డుకట్ట పడింది. అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం కార్పొరేట్ యాజమాన్యాలతో లాలూచీపడి విద్యను వ్యాపారంగా మార్చేసింది. ప్రభుత్వ బడుల బలోపేతం గాలి కొదిలేసి కార్పొరేట్‌కు రెడ్‌కార్పెట్ వేసింది.



ప్రభుత్వ బడులు మూసేయాల్సిందే



"జిల్లా వ్యాప్తంగా కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తుగా అడ్మిషన్‌ల ప్రక్రియ మొదలు పెట్టారు. ఇష్టానుసారం ఫీజులు వసూలు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలోని ఓ మంత్రికి సంబంధించిన విద్యాసంస్థలో జరుగుతున్న అధిక ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయలేకపోతున్నారు. అధిక ఫీజులు, ముందస్తు అడ్మిషన్‌ల ప్రక్రియ వల్ల ప్రభుత్వ బడులను భవిష్యత్‌లో మూసివేయాల్సిన పరిస్థితులు వస్తాయి.

– శివారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యదర్శి. తిరుపతి జిల్లా

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుపతి అన్నమయ్యసర్కిల్: శ్రీవారి భక్తులకు సేవలు అందిస్తున్న ఉద్యోగుల సమస్యలను నిర్దేశించిన సమయంలో పరిష్కరించాలని అధికారులను టీటీడీ ఈఓ శ్యామల రావు అధికారులను ఆదేశించారు. మంగళవారం వివిధ శాఖల ఉన్నతాధికారులతో పరిపాలనా భవన సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ పరిధిలోని అంశాలకు సంబంధించి వారితో చర్చించి అనుమతులు తీసుకుని పరిష్కరించాలన్నారు. ఉద్యోగుల ఆరోగ్యం కోసం ఎంప్లాయీస్ హెల్త్ కేర్ ఫండ్ కేటాయింపులో, ఇతర అలవెన్స్‌ల చెల్లింపులో అలసత్వం ప్రదర్శించవద్దన్నారు. నిబంధనల ప్రకారం పదోన్నతులు, బదిలీలు, కారుణ్య నియామకాలు చేపట్టాలని సూచించారు. జీఎన్సీ, ఎస్వీ పూర్ హోమ్, కే.టీ.వినాయకనగర్, రామనగర్ ప్రాంతాల్లోని టీటీడీ క్వార్టర్స్‌లో డ్రైనేజీ సమస్యలు, భవనాల లీకేజీలు, విద్యుత్ వంటి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఇప్పటికే కేటాయించిన ఇళ్ల స్థలాలపై వివిధ శాఖల అనుమతుల విషయంలో సీనియర్ అధికారులతో కమిటీ వేసి పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో జేఈఓ వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, డీఎల్వో వరప్రసాద్ రావు, వివిధ శాఖల డిప్యూటీ ఈఓలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీ సీ షెడ్ వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 84,258 మంది స్వామివారిని దర్శించుకోగా 33,502 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.90కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.

న్యూస్‌రీల్

సాక్షి పత్రికా కార్యాలయంపై దాడి హేయం



మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ప్రజల పక్షాన నిలిచి కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగడుతున్న సాక్షి మీడియా పై కక్షగట్టి దాడుదలు చేయడం దుర్మార్గమని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ధ్వజమెత్తారు. నాయుడుపేట క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీ మణి వైఎస్.భారతిపై టీడీపీ, జనసేన పార్టీ నాయకుల నాయకులు అనరాని మాటలు అన్నా ఏమీ పట్టించుకోలేదన్నారు. సాక్షి మీడియాలో విశ్లేషకులు మాట్లాడిన మాటలను సాకుగా చూపి పత్రికా కార్యాలయంపై దాడులు చేయడం దారుణమన్నారు. ఈదే తరహాలో మాట్లాడిన పలు టీవీ చానళ్లను కూటమి నేతలు ఎందుకు అడగలేకపోతున్నారని నిలదీశారు. రెడ్ బుక్ రాజ్యాంగం జర్నలిస్టుల పై కూడా వినియోగిస్తున్నారని, వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు.

ఆధునిక సమాజానికి సంస్కృతం దిక్సూచి కావాలి



వీసీని సన్మానిస్తున్న ఉత్కర్ష మహోత్సవ నిర్వాహకులు, అధికారులు

తిరుపతి సిటీ: ఆధునిక సమాజానికి సంస్కృత జ్ఞానం దిక్సూచి కావాలని ఇందుకోసం ప్రతి విద్యాంసుడు నడుం బిగించాలని జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి అభిప్రాయపడ్డారు. మహారాష్ట్ర నాసిక్‌లో కేంద్ర సంస్కృత వర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాలుగో ఉత్కర్ష మహోత్సవం మంగళవారంతో ముగిసింది. కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ సంస్కృత భాషాభివృద్ధికి ప్రతి వ్యక్తి ప్రతినబూనాలని కోరారు. ఆధునిక సమాజంలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో భావిభారతానికి సంస్కృత ఔన్నత్యాన్ని చాటిచెప్పాలన్నారు. ఈ మేరకు ఉత్కర్ష మహోత్సవంలో రోడ్డమ్యాప్ తయారు చేయడం జరిగిందని చెప్పారు. అనంతరం నిర్వాహకులు వీసీని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పలు సంస్కృత వర్సిటీల నుంచి అధికారులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


13న ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో ఈనెల 13వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టీ.శ్రీనివాసులు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, డీఫార్మసీ, బీ ఫార్మసీ, ఎమ్ ఫార్మసీ, ఏదేని డిగ్రీ అర్హత గల అభ్యర్థులు జాబ్ మేళాలో పాల్గొనవచ్చని తెలిపారు. మూడు పేరొందిన ఎమ్ఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాకు హాజరువుతారని పేర్కొన్నారు. మరిన్ని వివరాల కోసం 9533889902, 7989810194 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

వెంకటగిరిలో మరో కరోనా కేసు

నెల్లూరు(అర్బన్): నెల్లూరులోని ప్రభుత్వ పెద్దాస్పత్రి (సర్వజన ఆస్పత్రి)లో మంగళవారం మరో కరోనా కేసు నిర్ధారణ అయింది. వివరాలిలా ఉన్నాయి. తిరుపతి జిల్లా, వెంకటగిరి ప్రాంతానికి చెందిన 22 ఏళ్ల యువకుడు జ్వరం, దగ్గు, జలుబుతో బాధపడుతూ పెద్దాస్పత్రికి వచ్చాడు. ఇక్కడ అనుమానంతో కరోనా పరీక్ష చేయగా పాజిటివ్ వచ్చింది. ఆ యువకుడికి స్వల్ప లక్షణాలుండడంతో హోం ఐసోలేషన్‌లో ఉంటూ జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచించి ఇంటికి పంపారు. ఇప్పటి వరకు నెల్లూరు నగరంలో చేసిన పరీక్షల్లో 9 మందికి కరోనా నిర్ధారణ అయింది. అందులో ఐదుగురు నగర వాసులు, మరో ఇద్దరు గ్రామాలకు చెందిన వారు. ఇంకో ఇద్దరు తిరుపతి జిల్లా వాసులు. ఆస్పత్రికి వచ్చిన అనుమానితులకు మాత్రమే ఇక్కడ కోవిడ్ పరీక్షలు చేస్తున్నారు.

నేడు పెంచలకోనలో జ్యేష్టాభిషేకం



రాపూరు: పెంచలకోనలోని శ్రీపెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం జ్యేష్టాభిషేక వేడుకలు నిర్వహించనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. జేష్టమాసంలో జేష్ట నక్షత్రం, పౌర్ణమి ఒకేరోజు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని వైష్ణవ ఆలయాల్లో హోమం, అభిషేకాలు, నిర్వహించడం ఆచారమన్నారు.

మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

నాయుడుపేటటౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన మెగా జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. జాబ్ మేళాను సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ప్రారంభించారు. కలెక్టర్ వెంకటేశ్వరన్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి లోకనాథం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మధుసూదన్ వర్మ పాల్గొన్నారు. మేనకూరు సెజ్, శ్రీసిటీ, ఈఎంసీ క్లస్టర్, తిరుపతి, చెన్నైలోని 17కు పైగా బహుళ జాతి పరిశ్రమల్లో 600కు పైగా ఉద్యోగాల నియామకం కోసం ఆయా పరిశ్రమల హెచ్‌ఆర్‌లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. సుమారు 200 మందికి పైగా హాజరవగా వారిలో 128 మంది ఉద్యోగాలకు ఎంపిక చేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్‌రఫీ పాల్గొన్నారు.

డిగ్రీ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన డిగ్రీ సప్లిమెంటరీ 6వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు ఎగ్జామినేషన్స్ డీన్ ప్రొఫెసర్ కే సురేంద్రబాబు తెలిపారు. విద్యార్థులు ఫలితాల కోసం వర్సిటీ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

దాడులు చేసిన వారిని అరెస్ట్ చేయండి



ఏఎస్పీ రవిమనోహరాచారికి ఫిర్యాదు అందజేస్తున్న సాక్షి ప్రతినిధులు



రేణిగుంట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న సాక్షి ప్రతినిధులు

- అధికారులకు వినతిపత్రాలు అందజేసిన 'సాక్షి' యాజమాన్యం

తిరుపతి క్రైమ్: రేణిగుంటలోని సాక్షి కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు యత్నించిన వారితో పాటు రాష్ట్ర వ్యాప్తంగా దాడులు చేసిన వారిపై చర్యలు చేపట్టాలని తిరుపతి, చిత్తూరు జిల్లాల్లోని సాక్షి జర్నలిస్టులు సోమవారం పలుచోట్ల పోలీసు అధికారులకు వినతిపత్రాలను అందజేశారు. అందులో భాగంగా సోమవారం రాత్రి రేణిగుంట సీఐ జయచంద్రకు, మంగళవారం తిరుపతి అర్బన్ జిల్లా లా అండ్ ఆర్డర్ ఏఎస్పీ రవిమనోహరాచారికి సాక్షి బ్రాంచ్ మేనేజర్ సత్యేంద్రబాబు, బ్యూరో ఇన్‌చార్జ్ రవిరెడ్డి తదితరులు ఫిర్యాదు చేశారు. సిబ్బందికి, ఆస్తులకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రెండు జిల్లాల్లోని మరికొన్ని పోలీస్ స్టేషన్లలో కూడా మంగళవారం ఫిర్యాదులు అందజేశారు.

గజ వాహనం..భక్తజన పావనం



తెప్పపై విహరిస్తున్న శ్రీపద్మావతీ అమ్మవారు



గజవాహనంపై విహరిస్తున్న సిరుల తల్లి

శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన మంగళవారం రాత్రి అమ్మవారు గజ వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం దివ్యాలంకార శోభితురాలైన శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పపై ఆశీనులై ఐదు మార్లు పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి అమ్మవారు గజ వాహనాన్ని అధిష్టించి తిరువీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. ఇదిలావుండగా తెప్పోత్సవాల్లో చివరి రోజైన బుధవారం రాత్రి గరుడ వాహనంపై అమ్మవారు ఊరేగనున్నారు. ఆలయ డెప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈఓ దేవారాజులు, సూపరింటెండెంట్లు రమేష్, శ్రీవాని, ఆలయ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. – చంద్రగిరి



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.99,400
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.8,999
వెండి:
హోల్‌సేల్‌ ధర (కిలో) రూ.1,09,600
రిటైల్‌ వెండి గ్రాము రూ.112.60

క్లుప్తంగా

డ్వాక్రా మహిళ ఆత్మహత్య


మృతి చెందిన సుమలత

శ్రీకాళహస్తి: రుణం కట్టలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని చెంచులక్ష్మి కాలనీలో మంగళవారం చోటుచేసుకుంది. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసుల కథనం.. సుమలత అలియాస్‌ ఉష(40) డ్వాక్రా గ్రూప్‌లో సభ్యురాలు. ఈమె అందులో రుణం పొంది కంతులు కడుతుండేవారు. మంగళవారం ఆమె రూ.20 వేలు డ్వాక్రా గ్రూప్‌లో కట్టాల్సి ఉండగా సమయానికి డబ్బు అందలేదు. అవమానాల పాలవుతామనే బాధతో పురుగుల మందు తాగేసింది. కుటుంబ సభ్యులు ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ


బాధితురాలితో మాట్లాడుతున్న పోలీసులు

చంద్రగిరి: వాకింగ్‌ చేస్తున్న మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు చైన్‌ స్నాచింగ్‌కు పాల్పడిన ఘటన తిరుచానూరు పోలీసు స్టేషన్‌ పరిధి మంగళం సమీపంలోని చెన్నాయగుంట వద్ద మంగళవారం చోటుచేసుకుంది. చెన్నాయగుంట ప్రాంతానికి చెందిన భారతి మరో మహిళతో కలసి వాకింగ్‌ చేసేందుకు వెళ్లింది. వాకింగ్‌ చేస్తున్న క్రమంలో ముఖానికి మాస్కులు ధరించుకుని ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తు తెలియని దుండగులు మహిళ మెడలోని గొలుసును చోరీ చేసి పరారయ్యారు. తిరుచానూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేసీబీ, రెండు ట్రాక్టర్లు సీజ్‌


గాజులమండ్యం పోలీస్‌ స్టేషన్‌లో సీజ్‌ చేసిన జేసీబీ

రేణిగుంట: మండలంలో ఇసుక అక్రమ తవ్వకాలపై గత వారంలో ‘సాక్షి’లో వచ్చిన వరుస కథనాలకు గాజులమండ్యం పోలీసులు స్పందించారు. ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణాపై వరుస దాడులు నిర్వహించారు. ఎల్లమండ్యం పంచాయతీలోని పిల్లపాళ్యం సమీపంలో మంగళవారం ఉదయం జేసీబీతో ఇసుక తవ్వకాలు జరుపుతుండగా గాజులమండ్యం సీఐ మంజునాథరెడ్డి, ఎస్‌ఐ సుధాకర్‌ తమ సిబ్బందితో వెళ్లి సీజ్‌ చేశారు. అలాగే రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకున్నారు.

తోట దాటని మామిడి


తోటల్లోనే ఉన్న కాయలు

మామిడికి గిట్టుబాటు ధరలేక రైతులు విలవిల్లాడుతున్నారు. పెట్టిన పెట్టుబడీ చేతికందదేమోనని ఆందోళన చెందుతున్నారు. వ్యాపారులు, జ్యూస్‌ ఫ్యాక్టరీ యజమానులు కుమ్మక్కై గిట్టుబాటు ధరలేకుండా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం కూడా మీనమేషాలు లెక్కిస్తూ చోద్యం చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పక్వానికొచ్చినా కాయలు కోయకుండా తోటల్లోనే వదిలేశారు. ఎప్పుడు ధర వస్తే అప్పుడు కోతలు ప్రారంభిస్తామని చెబుతున్నారు.

- ధరలు లేక రైతులు విలవిల
- కాయలు కోయకుండా ధర కోసం ఎదురు చూపు

మామిడి ధరలు

రకం	ధర రూ.(కిలో)
బేనీషా	6– 15
ఖాదర్‌	8– 13
మల్లిక	20– 25
నీలం	10 –12
తోతాపురి(బెంగళూరు)	4
నాటుకాయలు	3
ఇమాంపసంద్‌	40–60
రుమానీ	7–8
పుల్లూర	4–8
దసేరియా	20–40

పాకాల: మండలంలో సుమారు 8 వేల ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. ఈ తోటల్లో 30 వేల నుంచి 35 వేల టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. పాకాల చుట్టుపక్కల ప్రాంతాల్లో తోతాపురి, బేనీషా, ఖాదర్‌, సింధూర, మల్లిక, నీలం, నాటు కాయలు ఎక్కువగా సాగుశారు. పాకాల మండలంలో అత్యధికంగా తోతాపురి(బెంగళూరు రకం) సుమారుగా 6,500 టన్నులు దాకా రావచ్చని అంచనా.

నిరాశే

మామిడి రైతులు, చిరు వ్యాపారులు మామిడి పంటపై అధిక పెట్టుబడులు పెట్టారు. ఆశించిన రీతిలో పంట దిగుబడి రావడంతో లాభాలు రావచ్చని ఆశపడ్డారు. కానీ పంట కోయకనే ధరలు పతనమవ్వడంతో ఏం చేయాలో తెలియక తికమకపడుతున్నారు. కాయలు కోయకుండా తోటల్లోనే వదిలేస్తూ ధర కోసం నిరీక్షిస్తున్నారు. తోటల్లో కాయలు పండ్లుగా మాగి కుళ్లిపోతున్నాయి. మరికొన్ని ప్రాంతాల్లో దోమ కాటుతో తోటల్లోనే పండ్లు చెడిపోతున్నాయి. పంట పెట్టుబడులు, కోత కూలీలు, బాడుగలు కూడా వచ్చే పరిస్థితి లేదని వాపోతున్నారు.

వెలవెలబోతున్న దామలచెరువు

దేశంలోనే మామిడి కాయలకు దామలచెరువు ప్రసిద్ధి. గతంలో మామిడి కాయల సీజన్‌లో దుకాణాల వద్ద రద్దీ అధికంగా ఉండేది. దామలచెరువు దిగువ గేటు నుంచి ఎగువ గేటుకు వెళ్లాలంటే సుమారు అర్ధగంట నుంచి గంట సమయం పట్టేది. ఇక్కడి నుంచి మహారాష్ట్ర, గుజరాత్‌, కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలతో పాటు ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేసేవారు. కాయలు తీసుకెళ్లేందుకు లారీలు వందల సంఖ్య వేచి ఉండేవి. అలాంటిది ఇప్పుడు మామిడికి మద్దతు ధర లేకపోవడంతో వెలవెలబోతోంది. ప్రస్తుతం పదుల సంఖ్యలో కూడా లారీలు కనిపించడం లేదు.

పెట్టుబడులు అధికం

మామిడి పంటలో మంచి దిగుబడికి 7 నుంచి 10 సార్లు దున్నకాలు చేపడుతారు. దున్నకాల తర్వాత పశువుల ఎరువుతో పాటు డీఏపీ, సూపర్‌ ఫాస్పేట్‌, వేపపిండిని కలిపి పిచికారీ చేస్తారు. ఎకరానికి రూ.30 వేలకు ఖర్చు చేస్తారు. ఇవి కాకుండా కాయల కోత సమయంలో కూలీలు, కోసిన కాయలు తరలించడానికి బాడుగలకు అదనంగా ఖర్చు చేస్తారు. అయితే ప్రస్తుతం మామిడి కాయలకు గిట్టుబాటు ధర లేకపోవడంపై తీవ్ర నష్టాలు ఎదురయ్యే పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు.


కళ తప్పిన మామిడి మండీ

గిట్టుబాటు ధర కల్పించాలి



ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు మామిడి కాయలకు గిట్టుబాటు ధర కల్పించడంపై రైతులతో సంప్రదించాలి. రైతుల కష్టాలను గుర్తించి పంటకు తగ్గట్టుగా గిట్టుబాటు ధర కల్పించాలి. అలాగే మామిడి జ్యూస్‌ ఫ్యాక్టరీ యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ధరకు కాయలు కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలి.

– ఏ.కృష్ణయ్య, మొగరాల, పాకాల మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



ప్రభుత్వం సూచించిన ధరకు రైతుల వద్ద నుంచి మామిడి కాయలను ఎవ్వరూ కొనుగోలు చేయడం లేదు. రైతులు కోతలు జరపకుండా ఆందోళనలో ఉన్నారు. ఇక్కడ పరిస్థితులను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళతాం. రైతులకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతాం.

– శైలజకుమారి, ఉద్యాన అధికారిణి, పాకాల

గిట్టుబాటు ధర కల్పించాలని నిరసన

- రోడ్డుపై బైఠాయించిన రైతులు
- ధర తగ్గిస్తున్న దళారులపై కేసులు నమోదు చేయాలని డిమాండ్‌


రోడ్డుపై బైఠాయించిన మామిడి రైతులు

పాకాల: దళారులు, ఫ్యాక్టరీ యజమానులతో కుమ్మక్కై మామిడికి గిట్టుబాటు ధర కల్పించడం లేదని మామిడి రైతులు పాకాల మండలం, దామలచెరువు హైస్కూల్‌ గేటు వద్ద మంగళవారం రోడ్డుపై బైఠాయించి నిరసన చేపట్టారు. ర్యాంపుల వద్ద దళారులు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.8,000కు కాకుండా కేవలం టన్నుకు రూ.4,000కు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే దళారులు, సప్లయర్స్‌, ఫ్యాక్టరీ యజమానులు కొనుగోలు చెయ్యాలని, రేటు తగ్గించి కొనుగోలు చేసే దళారులపై కేసులు నమోదు చెయ్యాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం నుంచి అందాల్సిన రూ.4 వేలు నేరుగా రైతుకే అందే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్‌ చేశారు. తోటల్లోనే మామిడి కాయలు మాగి పోతున్నాయని, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన చెందారు. తక్కువ ధరకు తోతాపురి రకాన్ని కొనుగోలు చేయడంతో తోటలపై పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదన్నారు. రోడ్డుపై బైఠాయించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్‌ సంతోష్‌సాయి, సీఐ సుదర్శన్‌ప్రసాద్‌ సంఘటనా స్థలానికి చేరుకుని రైతులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే మళ్లీ ధర్నా చేస్తామని మామిడి రైతులు హెచ్చరించారు.

ఇళ్లను క్రమబద్ధీకరించండి

రేణిగుంట: తిరుపతి పర్యటన నిమిత్తం విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను బంజారా హిల్స్‌ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు కలిసి తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. తిరుపతిలో మంగళవారం మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను బంజారా హిల్స్‌ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. అధ్యక్షుడు ఇస్లావత్‌ బాలాజీ నాయక్‌ మాట్లాడుతూ రేణిగుంట మండలం, వెంకటాపురం పంచాయతీ, అన్నాసామిపల్లి లెక్క దాఖలా సర్వే నంబర్‌ 341/1,2,3లో నివాసం ఉంటున్నామని, తమ ఇళ్లను రెగ్యులరైజ్‌ చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. వెంటనే సమస్య పరిష్కరించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. గౌరవ అధ్యక్షుడు లక్ష్మీరామ్‌నాయక్‌ నారాయణస్వామి నాయక్‌, రవీంద్ర నాయక్‌ పాల్గొన్నారు.

‘అయ్యో’ర్ల పడిగాపులు


కౌన్సెలింగ్‌ కేంద్రంలో చీకటిలో నిరీక్షిస్తున్న టీచర్లు

- రాత్రి 9.50 గంటలైనా ప్రారంభం కాని కౌన్సెలింగ్‌

చిత్తూరు కలెక్టరేట్‌ : ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని ఎస్జీటీలు బదిలీల కౌన్సెలింగ్‌ కోసం జిల్లా కేంద్రంలో పడిగాపులు కాశారు. రాత్రి 9.50 గంటల సమయం అయినప్పటికీ కౌన్సెలింగ్‌ను విద్యాశాఖ అధికారులు ప్రారంభించలేదు. ఈ కౌన్సెలింగ్‌కు హాజరైన ఎస్జీటీ టీచర్ల సీనియారిటీ ప్రకారం బదిలీలు నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. టీచర్లు కౌన్సెలింగ్‌ కేంద్రంలో చీకటిలో కూర్చుని రాత్రంతా నిరీక్షించారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు రాత్రి 9.20 గంటలకు ఎస్జీటీల సీనియారిటీ జాబితాను విడుదల చేశారు. ఆ జాబితాలో సమగ్ర సీనియారిటీ జాబితాను ప్రదర్శించాలని టీచర్లు డిమాండ్‌ చేశారు. అధికారులు 350 వరకు జాబితాను విడుదల చేసి మిన్నకుండి పోయారు. సమగ్ర సీనియారిటీ జాబితాను విడుదల చేస్తే బదిలీల్లో న్యాయం జరుగుతుందని పలువురు ఎస్జీటీలు వెల్లడించారు.

సంఘం నాయకులకు నో ఎంట్రీ

కౌన్సెలింగ్‌ నిర్వహించే సమయంలో టీచర్ల తరఫున సమస్యలను పరిష్కరించుకునేందుకు వివిధ సంఘాలు పాల్గొనడం ఆనవాయితీ. అయితే ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్‌లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఏ సంఘం నాయకులు హాల్‌లోకి రాకూడదని జిల్లా విద్యాశాఖ అధికారులు హుకుం జారీ చేశారు. ఎన్నడూ లేని వింత విధానాలను చిత్తూరు విద్యాశాఖ అధికారులు అమలు చేస్తున్నారని వివిధ సంఘ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘం నాయకులు ఇతర జిల్లాల్లో విచారించగా నాయకులను అనుమతిస్తున్నారని తెలిసింది.

నేడు ఎస్జీటీల బదిలీల కౌన్సెలింగ్‌

జిల్లాలోని ఎస్జీటీలకు నేటి నుంచి బదిలీల కౌన్సెలింగ్‌ నిర్వహించనున్నట్లు చిత్తూరు డీఈఓ వరలక్ష్మి తెలిపారు. మంగళవారం రాత్రి ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఎస్జీటీలు సీనియారిటీ జాబితా ప్రకారం సీరియల్‌ నం.351 నుంచి 700 వరకు ఉదయం 9.30 గంటలకు, సీరియల్‌ నం.701 నుంచి 1000 వరకు మధ్యాహ్నం రెండు గంటలకు కౌన్సెలింగ్‌ నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎస్జీటీలు చిత్తూరు శర్మన్‌ పాఠశాలలో జరిగే కౌన్సెలింగ్‌ కు తప్పక హాజరు కావాలని డీఈఓ కోరారు.

తెప్పోత్సవం.. పరిపూర్ణం


చక్రత్తాళ్వార్‌ తీర్థంలో శాస్త్రోక్తంగా చక్రస్నానం చేపడుతున్న అర్చకులు


స్వామివారికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చక పండితులు

తిరుపతిలోని శ్రీగోవింద రాజస్వామి వారి ఆలయంలో ఈనెల 2 నుంచి పది రోజుల పాటు చేపట్టిన స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన మంగళవారం చక్ర స్నానాన్ని వేడుకగా చేపట్టారు. రాత్రి ధ్వజావరోహణం చేపట్టడంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. పెద్దజీయర్‌ స్వామి, చిన్నజీయర్‌ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో వీఆర్‌.శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు.

– తిరుపతి కల్చరల్‌

ఉరివేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి

చంద్రగిరి: ఉరి వేసుకుని గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని పనపాకం సర్వీసు రోడ్డు సమీపంలోని విరుపాక్షమ్మ అమ్మవారి ఆలయ వెనుక వైపు మంగళవారం చోటు చేసుకుంది. సుమారు 60 ఏళ్ల వయస్సు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి అమ్మవారి ఆలయ వెనుక వైపు ఉరివేసుకుని మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు.

కార్మికుల సెల్‌ఫోన్లు మాయం

చంద్రగిరి: పొట్టకూటి కోసం వేరే రాష్ట్రం ఉంచి వలస వచ్చిన కార్మికుల సెల్‌ ఫోన్లను కేటుగాళ్లు కాజేసిన ఘటన మంగళవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. బాధితుల వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన దీరేంద్ర కుమార్‌తో పాటు సుమారు ఎనిమిది మంది శ్రీవిద్యానికేతన్‌ సమీపంలోని ఓ భవన నిర్మాణంలో కూలీలుగా పనిచేస్తున్నారు. సోమవారం రాత్రి పనులు ముగించుకుని నిర్మాణంలో ఉన్న భవనంలోనే నిద్రించారు. మంగళవారం తెల్లవారుజామున లేచి చూడగా దీరేంద్ర కుమార్‌తో పాటు మరో ఐదుగురు సెల్‌ఫోన్లు కనిపించలేదు. గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గ్రహించిన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

ముగిసిన బదిలీల ఘట్టం

తిరుపతి అర్బన్‌: ప్రభుత్వ ఉద్యోగుల బదిలీల ఘట్టం సోమవారం సాయంత్రం 5 గంటలకే ముగిసింది. బదిలీల జాబితాను కొన్ని విభాగాలు మంగళవారం వెల్లడించారు. ప్రధానంగా రెవెన్యూ విభాగంలో పలువురు తహసీల్దార్లు, డీటీలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్‌ అసిస్టెంట్లు, జూనియర్‌ అసిస్టెంట్లు బదిలీ అయినప్పటికీ వెల్లడించలేదు. పచ్చ నేతలు ఇచ్చిన జాబితా మేరకు సర్దుబాటు చేయడానికి అధికారులు కుస్తీ పడుతున్నారు. రెవెన్యూ మినహా మిగిలిన విభాగాల్లోని జిల్లా అధికారులు ఈ అంశంపైనే కసరత్తు చేస్తున్నారు.

బదిలీ అయిన అధికారులు

జిల్లా ప్రజారవాణా అధికారి(డీపీటీవో) వెంకట్రామ్‌ను విజయవాడ ఆర్టీసీ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. ప్రకాశం జిల్లా డీపీటీవోగా పనిచేస్తున్న ఈయన గత ఏప్రిల్‌ 29న బాధ్యతలు స్వీకరించారు. 42 రోజుల వ్యవధిలోనే మళ్లీ బదిలీ అయ్యారు. కొందరు ఆర్టీసీ ఉద్యోగ సంఘం నేతలకు నచ్చకపోవడంతో పచ్చనేతలకు చెప్పి బదిలీ చేయించినట్లు జోరుగా చర్చసాగుతోంది. సహకారశాఖ జిల్లా అధికారి లక్ష్మిని చిత్తూరుకు బదిలీ చేశారు. చిత్తూరులో పనిచేస్తున్న ఎస్వీ నాగవర్ధన్‌ను తిరుపతికి బదిలీ చేశారు. జలవనరులశాఖలోను 52 మంది బదిలీ అయ్యారు. ఉద్యానశాఖ పరిధిలో పనిచేస్తున్న పలువురు హార్టికల్చర్‌ ఆఫీసర్లు బదిలీ అయ్యారు. తిరుపతిలో పనిచేస్తున్న సునీల్‌ రాజంపేటకు, చిన్నగొట్టిగల్లులో పనిచేస్తున్న శివకుమారి తిరుపతికి, నాయుడుపేటలో పనిచేస్తున్న శారద సూళ్లూరుపేటకు, గూడూరులో పనిచేస్తున్న కార్తీక్‌ భరద్వాజ్‌ సంగంకు, సంగంలో పనిచేస్తున్న సునీతా గూడూరుకు, సూళ్లూరుపేటలో పనిచేస్తున్న యామిని నాయుడుపేటకు బదిలీ అయ్యారు. అదేవిధంగా వ్యవసాయశాఖలోను పలువురు అధికారులు బదిలీ అయ్యారు. వెంకటగిరిలో పనిచేస్తున్న నాగార్జునసాగర్‌ నాయుడుపేటకు, నెల్లూరులో పనిచేస్తున్న అనసూయ వెంకటగిరికి, నగరిలో పనిచేస్తున్న సౌభాగ్యలక్ష్మి జిల్లా రిసోర్స్‌ ఆఫీస్‌కి, పుత్తూరులో పనిచేస్తున్న లక్ష్మి కడపకు బదిలీ అయ్యారు. అంతేకాకుండా మండల వ్యవసాయ అధికారులుగా పనిచేస్తున్న 19 మంది బదిలీ అయ్యారు. రెవెన్యూ బదిలీలు బుధవారం వెల్లడించనున్నారు.

భవనం పై నుంచి దూకిన విద్యార్థి

తిరుపతి సిటీ: కరకంబాడి రోడ్డులోని ఓ ఇంజినీరింగ్‌ కళాశాల క్యాంటీన్‌ భవనం పైనుంచి విద్యార్థి దూకిన ఘటన మంగళవారం కలకలం రేపింది. కళాశాల సిబ్బంది సమాచారం మేరకు.. కళాశాలలో ఎంసీఏ మొదటి సంవత్సరం చదువుతున్న బాలాచారి మంగళవారం ఉదయం అల్పాహార సమయంలో క్యాంటీన్‌ భవనం పైకి ఎక్కి కిందకి దూకేశాడు. విద్యార్థి కాలుకు బలమైన గాయమైంది. అతన్ని ఆస్పత్రికి తరలించారు. శ్రీకాళహస్తిలోని విద్యార్థి తండ్రి విజయభాస్కరాచారికి సమాచారం ఇచ్చారు. విద్యార్థి మానసిక స్థితి సరిగాలేదని దీని కారణంగానే తమ కొడుకు ఇలా చేశాడని విద్యార్థి తల్లిదండ్రులు చెప్పారు.

రోడ్డుకు అడ్డంగా గోడ


రోడ్డుకు అడ్డంగా కట్టిన గోడ

పెళ్లకూరు: పెళ్లకూరు మండలం, శిరసనంబేడు గ్రామం మీదుగా అమ్మన్‌ ట్రై స్టీల్‌ పరిశ్రమకు వెళ్లే రహదారికి అడ్డంగా గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళికృష్ణారెడ్డి మంగళవారం ఏకంగా గోడ కట్టి వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించారు. స్థానికుల సమాచారం మేరకు.. పదిహేనేళ్ల కిందట గ్రామంలో స్టీల్‌ పరిశ్రమ నెలకొల్పారు. పరిశ్రమ వాహనాలు గ్రామంలోని ప్రధాన వీధి గుండా రాకపోకలు సాగిస్తుండడం వల్ల లారీ కింద పడి ఓ బాలుడు మృతి చెందాడు. అప్పటి నుంచి ప్రధానవీధి గుండా పరిశ్రమ వాహనాలు రాకుండా నిలిపేశారు. ఆ సంస్థ తాత్కాలికంగా వేరే రహదారి ఏర్పాటు చేసుకుంది. ఈ మార్గాన్ని ఆనుకొని ఓ వెంచర్‌ ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన పట్టా భూముల్లో రోడ్డు ఏర్పాటు చేసినట్లు, నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాలని కొందరు బాధితులు ఇటీవల కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో నిర్వాసితులకు పరిశ్రమ యాజమాన్యం అడ్వాన్స్‌ అందజేసినట్లు సమాచారం. ఈ పరిహారం విషయంలో గ్రామానికి చెందిన నిర్వాసితుల మధ్య కోర్టులో వివాదం నడుస్తోంది. ప్రస్తుతం వెంచర్‌ యాజమాన్యం తాత్కాలిక రోడ్డును బీటీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. పూర్తి స్థాయి పరిహారాన్ని వెంటనే చెల్లించాలంటూ టీడీపీ నాయకుడు మురళీకృష్ణారెడ్డి పట్టుబట్టారు. వాహనాల రాకపోకలు జరగకుండా రోడ్డుకు అడ్డంగా గోడ కట్టించారు. ఈ విషయమై గ్రామంలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఇద్దరు చైన్‌ స్నాచర్ల అరెస్ట్‌


నిందితుల అరెస్టును చూపుతున్న సీఐ నాగార్జునరెడ్డి

శ్రీకాళహస్తి: ఇద్దరు చైన్‌ స్నాచర్లను అరెస్టు చేసినట్లు రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. మంగళవారం మీడియా సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు. తిరుపతి జిల్లా ఎమ్మార్‌పల్లెకు చెందిన అల్తాఫ్‌(19)బైక్‌ మెకానిక్‌. శ్రీకాళహస్తి మండలం, నారాయణపురం గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్‌(20)తో కలిసి మద్యం, గంజాయికి బానిసయ్యారు. ఈజీ మనీ కోసం వారు తిరుపతి బస్‌స్టేషన్‌, రైల్వేస్టేషన్‌, శ్రీకాళహస్తి బస్‌స్టేషన్‌, రైల్వేస్టేషన్‌ పరిసరాల్లో బైక్‌లు దొంగలించే వారు. ఒంటరిగా వెళుతున్న మహిళల మెడలోని బంగారు గొలుసులను లాక్కుని పారిపోయేవారు. తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాలతో శ్రీకాళహస్తి డీఎస్పీ పర్యవేక్షణలో రెండవ పట్టణ సీఐ నాగార్జునరెడ్డి నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండు వద్ద ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు నిందితుల వద్ద నుంచి రెండు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

దోపిడీయే మా సంకల్పం!

- రోగుల జేబులు గుల్ల చేస్తున్న కార్పొరేట్‌ ఆస్పత్రి
- పట్టించుకోని అధికారులు


తుడా రోడ్డులోని ఆస్పత్రిలో రోగి బంధువుతో సిబ్బంది వాగ్వాదం

తిరుపతి తుడా: ‘సేవలు చేయం.. రోగుల దోపిడీయే మా సంకల్పం’ అంటూ చెలరేగిపోతోంది తిరుపతిలోని ఓ కార్పొరేట్‌ ఆస్పత్రి యాజమాన్యం. తుడా రోడ్డులో వెలసిన ఆ ఆస్పత్రి ధనార్జనే లక్ష్యంగా రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతోంది. తరచూ రోగుల బంధువులతో గొడవలకు దిగుతోంది. ఏదైనా జబ్బుతో ఆస్పత్రికి వస్తే లేనివి ఉన్నట్లు చూపుతూ లక్షలు గుంజేయడం రివాజుగా మారుతోంది.

ఓపీ నుంచే గుంజుడు మొదలు

ఆస్పత్రిలో ఓపీ తీసుకోవడం మొదలు వైద్య, వివిధ అనవసర పరీక్షలు, ఆపై అడ్మిషన్‌, చికిత్స అంతా ఇక రోగి బంధువుల చేతిలో ఉండదు. ప్రతి చిన్న సమస్యను భూతద్దంలో పెట్టి పెద్దదిగా చూపుతూ రోగి తోపాటు బంధువులను భయాందోళనకు గురి చేయడం ఆస్పత్రికి అలవాటుగా మారింది. ఐసీయూ పేరుతో రోజుకు వేలాది రూపాయలను ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. డబ్బు కోసం శవాలకు సైతం చికిత్స అందిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఆస్పత్రిలో వివాదాలు రోజురోజుకు శ్రుతి మించుతున్నాయి. రోగుల బంధువులను కట్టడి చేసేందుకు ఆస్పత్రి యాజమాన్యం ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకుంది. ఎవరైనా అక్కడ ప్రశ్నిస్తే దాడులకు తెగబడుతోంది. కేసులు నమోదు చేస్తామని హెచ్చరికలు జారీ చేస్తోంది.

ఆ ఆస్పత్రిలో చేరితే ఇక అంతే!

గంగాధరనెల్లూరుకు చెందిన 58 ఏళ్ల మహిళకు తల తిరుగుతుండడంతో ఇటీవల ఆస్పత్రికి వచ్చారు. రోగి బంధువుల ముందు నానాహంగామా సృష్టించి స్కానింగ్‌ చేయించారు. అత్యవసరంగా ఐసీయూలో చికిత్స అందించాలంటూ హడావిడి చేశారు. ఏదో జరిగిపోతుందన్న భయంలో ఒకరోజు బంధువులు అందుకు సరే అన్నారు. వారం రోజులు పాటు ఐసీయూలో చికిత్స అందించి వ్యాధి నయం అయిపోయిందంటూ పంపిం చేశారు. రోజుకు రూ.30 వేల చొప్పున రూ.2.10 లక్షలు, మెడిసిన్‌కు లక్ష ఇరవై వేలు, ఓపీ, వివిధ స్కానింగ్‌ల కోసం మరో రూ.28,000 కట్టించుకుని జేబులు నింపుకున్నారు. ఈ ఆస్పత్రి రిపోర్టులను మరో వైద్యుని దగ్గర చూపించగా బాధితుడికి ఐసీయూలో చికిత్స అందించే అంత వ్యాధి లేదని నిరూపితమైంది. దీంతో ఆస్పత్రి వద్ద కుటుంబ సభ్యులు ఆందోళన చేసినా పట్టించుకునే వారు కరువయ్యారు. అలాగే నాలుగు రోజుల క్రితం రైల్వే కోడూరుకు చెందిన ఓ మహిళకు అందించిన చికిత్స వ్యవహారం వివాదాస్పదంగా మారింది. రోగి బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళనకు దిగారు. ఇలా ఒకటి కాదు రెండు కాదు తరచూ వివాదాలు, గొడవలు జరుగుతున్నాయి.

నేమ్‌ బోర్డుల్లో మాత్రమే వైద్యులు

ఆస్పత్రిలోకి ప్రవేశించిన వెంటనే ప్రముఖ వైద్యుల పేర్లతో డిస్‌ప్లే కనిపిస్తుంది. అబ్బా... ఇక్కడ ఇంత మంది వైద్యులు ఉంటారా..? అని అనుకుంటే పొరబాటే. కానీ అక్కడ ఆ స్థాయిలో వైద్యులు అందుబాటులో ఉండరు. గెస్ట్‌ డాక్టర్లు ఎప్పుడొస్తారో తెలియని పరిస్థితి. విధిలేని పరిస్థితుల్లో అక్కడే నర్సులు, ఆస్పత్రి సిబ్బంది డాక్టర్ల అవతారం ఎత్తుతారు. నానా హంగామా చేసి బిల్లులు మెడకు చుట్టేస్తారు.

– శ్రీహరి, రోగి బంధువు